

# పున్నామ నరకం

డి.కామేశ్వరి

సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూ 'జయా డైగ్నొస్టిక్ సెంటర్'కి వెళ్లింది సరళ రిపోర్టు కోసం. ఏ ప్రెగ్నెంసీ టెస్టులు అక్కర లేకుండానే తనకే అర్థం అవుతున్నా కాదంటే బాగుండు అన్న ఆశతో వెళ్లింది. 'రిపోర్టు పాజిటివ్, కంగ్రాచ్యులేషన్స్' అంది అక్కడి డాక్టరు సరళ తెచ్చిన రిపోర్టు చూసి. జయ మొఖంలో సంతోషపు ఛాయలు లేకపోగా, కళ తప్పిన ఆమె మొహం చూసి "ప్రెగ్నెంసీ వద్దనుకున్నారా... ప్రికాషన్స్ తీసుకోక పోయారా-" అంది డాక్టరు. 'ఇది ఫస్ట్ ట్రైమా -' అని మళ్ళీ అడిగింది.

"ఫస్ట్‌ట్రైమయితే అంత ప్రాబ్లమ్ ఏముంది - థర్డ్ ట్రైమ్ డాక్టర్... ఏదో సేఫ్ పీరియడ్ అంటూ... నాకు లూప్, మాత్రలు పడలేదు. ఇప్పటికే ఇద్దరమ్మాయిలున్నారు -" చిరాగ్గా అంది సరళ.

"ఓ కొడుకు కోసమా, వద్దనుకుంటే యూ కెన్ ప్రొసీడ్ ఫర్ ఎమ్. టి.పి..." అని ఉచితసలహా ఇచ్చింది డాక్టరు. తల ఆడించి బ్యాగులోంచి డబ్బు తీసి టేబుల్ మీద పెట్టి నీర్సంగా బయటికి నడిచింది.

* * * * *

"ఏమిటంత కొంప మునిగిందని ఇంత రాద్ధాంతం చేస్తున్నావు. ఎలాగో ఇంకోసారి ట్రై చెయ్యాలనుకున్నాం, అది కాస్త ముందయింది. అంతేగా -" ప్రభాకర్ చాలా తేలిగ్గా అన్నాడు. సాయంత్రం ప్రభాకర్ రాగానే విరుచుకుపడింది సరళ. 'చంటి దానికి ఇంకా ఏణ్ణర్థం అన్నా నిండలేదు. అప్పుడే మళ్ళీ, చెప్తున్నా వినకుండా సేఫ్ పీరియడ్ అన్నారు. ఇప్పటికే ఇద్దరు చంటి పిల్లలు, ఇటు ఇల్లు, అటు ఆఫీసు చేసుకోలేక చస్తున్నాను -' అంటూ ఎగిరిపడింది.

"సరే అయిందేదో అయింది. ఈసారి అబ్బాయి పుట్టినా పుట్టకపోయినా ఆపరేషన్ చేయించుకుంటా..." ప్రభాకర్ రాజీ ధోరణి చూపాడు.

"పిల్లేదు - మూడోసారి ట్రై చెయ్యాలని మీరనుకున్నారేమో గాని నేనేం అనుకోలేదు. అబ్బాయి కోసం మూడోసారి కనే ఓపిక నాకు రాదు. మగపిల్లాడు లేకపోతే మరేం కొంప మునగదు - వున్న ఇద్దరితోనే ఖర్చులకి తట్టుకోలేకపోతున్నాం - మనకింకో పిల్లని పోషించే స్తోమత వుందనుకుంటున్నారా... పోషించడానికి మీరు సిద్ధంగా వున్నా కనడానికి నేను సిద్ధంగా లేను" సరళ కోపంగా అంది. ప్రభాకర్ సరళ కోపాన్ని గ్రహించి నట్లే...

"ఆ... ఇద్దరు పెరిగినవాళ్లు మరొకరూ అలాగే పెరుగుతారు, ఈ ఒక్కసారికి అయిపోనిద్దూ... ఈసారెందుకో అబ్బాయి పుడ్తాడని నమ్మకం..." ప్రభాకర్ నమ్మకంగా అన్నాడు.

"అబ్బాయా అమ్మాయా అన్నది కాదు నా ప్రశ్న. ఇంకో పిల్లని ఎలా కంటాం మన సంపాదనకి... అది అర్థం చేసుకోరేం... కొడుకు కోసం మూడో ఛాన్సు తీసుకోడం నాకిష్టం లేదు... ఇటు పెద్దదాని కాన్వెంట్, రెండోదాని క్రెషికి ఎంతవుతుందీ. ఈ పెరుగుతున్న ధరల్లో ఇద్దరం కల్సి నాలుగువేలు తెచ్చుకుంటున్నా నెలాఖరికి ఎంత కటకటలాడుతున్నాం... అన్నీ చూస్తూ ఇంకోసారి పిల్లని కంటానంటారేమిటి -" సరళకి ప్రభాకర్ ధోరణి చూసి చిర్రెత్తి అరిచింది.

"పెద్ద ఏదో ఇంటి బాధ్యత అంతా నీదే అన్నట్టు మాట్లాడకు... పెద్ద ఉద్యోగం చేసి ఇల్లంతా నీవే నడుపుతున్నట్టు నాదేం లేదన్నట్టు మాట్లాడుతున్నావు... ఏం ఎంత మంది మూడో పిల్లని కనటం లేదు... నాకు కొడుకు కావాలి..." ప్రభాకర్ సరళ కోపానికి కోపం తెచ్చుకుని తనూ అరిచాడు.

"ఆ... ఈసారి కొడుకు పుడ్తాడని గ్యారంటీ ఎవరిచ్చారో.... ఇంతకీ కొడుకేం తవ్వి తలకెత్తుతాడని మనం మూడోఛాన్సు తీసుకోవాలట...." ఎత్తి పొడిచింది.

"తవ్వి తలకెత్తకపోయినా.... ఓ మగ పిల్ల వాడుండాలి. ఇంటి పేరు నిలబడాలన్నా, వంశం నిలబడడానికన్నా ఓ మగ పిల్లాడుండద్దా.... మా అన్నయ్యకీ మగ పిల్లలు లేరు. మనకి లేకపోతే..... మా వంశం ఈ తరంతో......"

"ఆహా... పెద్ద వంశం నిలబడాలి - మనం ఏం 'నెహ్రులు, 'టాటాలు' 'బిర్లా'లమా కాదు. మన వంశం నిలబడక పోతే దేశానికొచ్చిన నష్టం ఏం లేదు. టాటాలు నెహ్రూలు వంశాలే నిలబడలేదు.... ఏదో మగపిల్లాడు వుండి తల్లితండ్రుల్ని ఆదుకోడం అవన్నీ పాత కబుర్లు... అందరిదాకా ఎందుకు మీరుండి మీ అమ్మకి నాన్నకి ఏం చెయ్యగల్గుతున్నారు? వూర్లో వున్న ఆ ముసలివాళ్లకి ఓ వంద రూపాయలన్నా పంపగల్గుతున్నారా.... వాళ్ల పాట్లేవో వాళ్లు పడ్తున్నారు...... ఎవరి సంసారాలు వారికే బరువయ్యే రోజుల్లో మనల్ని ఏ కొడుకో పుట్టి ఆదుకుంటాడనుకోడం వెర్రి ఆశ.... వాడు మనల్ని ఎప్పుడో ఉద్ధరించే మాట దేవుడెరుగు. ముందు ఓ పాతికేళ్లు వాడిని మనం ఉద్ధరించాలి - కని, పెంచి, చదివించి, ఉద్యోగం, పెళ్లి అన్నీ చేసాక అప్పుడు వాడి దయ వుంటే చూస్తాడు.... ఆపాటి దానికోసం మనం ఇంకొరిని కని పాతికేళ్లు కష్టపడాలి అన్నది మర్చిపోయి మాట్లాడకండి....... ఇన్ని మాటలనవసరం - నేను అబార్షన్ చేయించు

కుంటున్నాను అంతే. సరళ కోపంగా తెగేసి చెప్పింది.

"ఇంకేం చేసినా చెయ్యక పోయినా కనీసం తలకి కొరివన్నా పెట్ట డానికి ఒకడుండాలి గదా.... పుత్రులు లేక పున్నామనరకం..." ప్రభాకర్ కోపంగా రెట్టించాడు.

'చాల్లెండి పాత చింతకాయ కబుర్లు చెప్పకండి. మనం చచ్చాక ఎవడో తల కొరివి పెడితే మనకేం నష్టం......' సరళ మొండిగా వాదించింది. ఆమెని వప్పించలేని అసహాయతకి ప్రభాకర్ మొహం ఎర్రబడింది.

"చూడు, ఈ అబార్షన్‌కి నేను వప్పుకోను.... అది నాకిష్టం లేదు... ఆ పాపం నా కొద్దు....... నేను వప్పుకోను.... అంతే....." ప్రభాకర్ మగ అహం చూపాడు.

"పాపం మీకేం కాదులెండి - చేయించుకుంటున్నానన్నది నేను గనక ఆ పాపం నాదేలెండి...."

"నాకిష్టం లేదన్నాను.... నా ఇష్టంతో పనిలేదంటే నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో" ప్రభాకర్ విసురుగా లేచిపోయాడు.

సరళ వాదించి, అరచి అలిసిపోయి ప్రభాకర్‌ని వప్పించలేని నిస్సహాయతతో ఏడుస్తూ పడుకుంది.

* * * * *

మరో రెండు మూడు రోజులు సరళ అనేక రకాలుగా బెదిరించింది.' ఈసారి ఇంకో పిల్లని కనాలంటే ఉద్యోగం మానేస్తానని బెదిరించింది. దానికీ లొంగిరాకపోయేసరికి చెప్పకుండా వూర్లోవున్న పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లి కూడా అల్లుడినే సపోర్టు చేస్తూ మాట్లాడింది. "ఏ పదిమంది వున్నారని అంతలా కొట్టుకుపోతున్నావే, ఓ మగపిల్లాడన్నా లేకపోతే ఎలా. అతనన్న దానిలో తప్పేం వుంది. మగపిల్లాడు కావాలని సరదా పడుతున్నాడు పాపం - ఏం నీకేగాని అతనికి లేదా సంసార బాధ్యత - ఈ ఒక్కసారి చూద్దామన్నాడు గదా...' అంటూ చివాట్లు పెట్టింది కూతురిని. ఆప్తమిత్రురాలు జానకి, ఆఫీసులో కొలీగ్స్ అందరూ 'ఈ ఒక్కసారి చూడండి, దీని కోసం పంతాలు పట్టింపులతో కాపురం నరకంచేసుకోకండి' అని నచ్చ చెప్పారు.

వారం తిరిగాక సరళకి ఇంటికి రాకా తప్పలేదు! ఉద్యోగం చెయ్యకా తప్పలేదు - కడుపు వుంచుకోకా తప్పలేదు.

* * * * *

గుడ్డిలో మెల్ల అన్నట్టు సరళకీసారి మగపిల్లాడు పుట్టాడు. వ్రతం చెడ్డా ఫలం దక్కిందన్నట్టు తృప్తిగా నిట్టూర్చింది. ఇద్దరాడపిల్లల తరువాత పుట్టిన కొడుకుని చూసుకుని మురిసిపోయాడు ప్రభాకర్. "చూడు ఎంత ముద్దుగా వున్నాడో.... నయం, అబార్షన్‌కి వప్పుకున్నాను కాదు, ఇంత బంగారు బాబుని పోగొట్టుకునే వాళ్లం" అన్నాడు మురిపెంగా ఎత్తుకుంటూ. సరళకీ అంతరాంతరాలో ఏదో తృప్తిగానే అన్పించింది కొడుకుని చూసుకోగానే.

* * * * *

ఇరవై మూడేళ్లు గడిచాయి. ఈ ఇరవై మూడేళ్లు ఏ ఇరవై మూడు రోజులలా గడవలేదు సరళ, ప్రభాకర్లకి. చంటి వాడు, ఎడపిల్ల, ఆఫీసు, ఇల్లు, చాకిరి ఊపిరి తీసుకునే టైములేక సతమతమయి పిల్లలని పెంచడానికి అవస్థ ఓపక్క - ఆర్థిక ఇబ్బందులు ఓపక్క, పెరుగుతున్న పిల్లలు, పెరిగిన ధరలు పెరగని రాబడి మధ్య రోజు లెలా నెట్టారో వెనక్కి తిరిగి చూసుకుంటే సరళకే నమ్మశక్యం కాదు - ఏభై ఏళ్లకే సరళ తల ముగ్గు బుట్ట అయింది, ఏభై మూడేళ్లకే ప్రభాకర్ ఆర్థిక ఇబ్బందులతో నడుం విరిగిన ముసలివాడిలా అయ్యాడు.

ముగ్గురు పిల్లల చదువులు తలకు మించిన భారం అయినా పిల్లలు ముగ్గురూ తెలివిగా చదువుకున్నారన్న తృప్తి మిగిలింది వాళ్లకి. పెద్ద పిల్ల ఎమ్మే కాంగానే బ్యాంకి ఆఫీసరుతో పెళ్లి చేశారు. కొంత ప్రావిడెంట్ ఫండు లోంచి, కొంత లోను తీసుకుని పెళ్లి అయింది అనిపించడానికి ముప్ఫై ఎనిమిది వేలయింది. ఆ కూతురు పెళ్లి అప్పుతీరేలోగా రెండో కూతురు ఎమ్.కాం రెండో సంవత్సరంలోకి వచ్చి పెళ్లికి సిద్ధంగా ఎదిగి కూర్చుంది. కొడుకు ఇంటర్ ఫస్టు క్లాసులో పాసయ్యాడు. శక్తికి మించినదైనా కొడుకు ఎమ్‌సెట్ పరీక్ష రాస్తానంటే వద్దనలేకపోయారు, ఇంజనీరింగులో సీటు తెచ్చుకున్న కొడుకుని తాహతులేదని నిరాశ పుచ్చే శక్తి లేక ఇంజనీరింగులో చేర్చారు - 'ఎంత క్లుప్తంగా చూసుకున్నా నెలకి ఏడెనిమిది వందలు పంపాలంటే ప్రతి నెలా గండంలాగే అన్పించేది. కొడుకుని ఇంజనీరింగులో చేర్చి పుస్తకాలు బట్టలు అవి కొని చ్చే సరికి పెళ్లికి తీసుకున్న లోను తీరడం అటుంచి మరో ఆరువేలు అప్పుతేలింది. మరో రెండున్నర ఏళ్లల్లో రిటైరవుతాడు. ఈలోగా రెండో కూతురి పెళ్లి అవాలి - కొడుకు చదువు ఇంకో ఏణ్ణర్థం మిగులుతుంది. ఆ ఖర్చులు తల్చుకున్నప్పుడల్లా హార్ట్ అటాక్ వచ్చినట్టు గుండె బిగపట్టేది ప్రభాకర్‌కి. ఇద్దరూ సంపాదిస్తున్నా ఇల్లు గడవడానికే కష్టంగా వుంది. అవస్థలు భరించలేనపుడు, ఓపిక, సహనం నశించినపుడు, ఖర్చులు తట్టుకోలేనప్పుడల్లా సరళ మొగుడి మీద విరుచుకు పడేది మూడో బిడ్డని కన్నందుకు. 'నీ ఏడుపు ఇలా వుండబట్టే మన బతుకు ఇలా వుంది. ఇంకొక్క నాలుగేళ్లు కష్టపడ్తే కొడుకు ఇంజనీరు అవుతాడు. అప్పుడింక వాడే చూసుకుంటాడు - చదువుకి చేసిన అప్పు వాడే తీర్చుకుంటాడు. కొడుకు సంపాదించాక అప్పుడు తెలుస్తుంది కొడుకు విలువ.... ఏదో ఓ నాలుగేళ్లు కళ్లు మూసుకుంటే....' కళ్లు మూసుకుని కలలు కనే వాడు ప్రభాకర్. "ఆ.... ఉద్యోగం చేసి మనకేం తవ్వితలకెత్తడు. పెళ్లి చేసుకుని వాడి సంసారం వాడు చూసుకుంటాడు..... మనం, మన అప్పులు ఇలాగే వుంటాం' సరళ వ్యంగ్యంగా ఎత్తి పొడిచేది. ప్రభాకర్ ఉడుక్కుని సరళని మింగేసేట్టు చూసేవాడు.

ఎవరికలలు, వ్యథలతో సంబంధం లేకుండా కాలం ముందుకు సాగిపోయింది. ప్రభాకర్ రిటైరయ్యాడు. రెండో కూతురు పెళ్లికాలేదు కాని బాంకి క్లర్క్ పరీక్ష పాసయి బ్యాంకులో ఉద్యోగం చేస్తూంది. కూతురు సంపాదన భార్య సంపాదనకి తోడయి రిటైరయిన ప్రభాకర్‌కి కొండంత అసరా అయింది. అప్పులు తీరగా మిగిలిన ప్రావిడెటు ఫండు పట్టుమని పాతికవేలన్నా మిగలలేదు - కొడుకు ఇంజనీరయ్యే సరికి అది పదివేలకి దిగింది. ఇదిగో ఇంత కొడుకు ఇంజనీరయ్యాడు వేలుగడించడమే తరువాయి అనుకునే తరుణంలో కొడుకు ఇంకో బాంబు పేల్చాడు. ఫైనల్ ఇయర్ పరీక్షలుకాక ముందే అమెరికా వెళ్లడానికి టోఫెల్ వగైరా పరీక్షలు రాసి, పాసయి, సీటు తెచ్చుకున్నానని, ఎయిడ్ కూడా ఇస్తారని టిక్కట్టుకొనుక్కుని వెడితే చాలని... ఎలాగైనా ఏభై వేలు ఇస్తే అక్కడ రెండేళ్లు చదివితే డాలర్లలో సంపాదించితే అప్పులన్నీ ఏడాదిలో తీర్చేయచ్చని..... ఇండియాలో ఎన్నేళ్లు ఉద్యోగం చేస్తే మటుకు లక్షరూపాయలు కూడ బెట్టగలం... ఓ రెండేళ్లు మీరు కళ్లు మూసుకుంటే వేలకి వేలు సంపాదిస్తా, మన అప్పు కరిగిపోయి మీరు ఓ ఇల్లు కట్టుకుని కాలు మీద కాలేసుకు కూర్చోవచ్చని ఇలాంటి అవకాశం తపస్సు చేసినా మళ్లీ రాదని అకాశంలో హర్మ్యాలు కట్టి చూపించాడు కొడుకు. కొడుకు చూపించిన అందమైన భవిషత్తు మీద ప్రలోభం ఓ పక్క, కొడుకు భవిషత్తుని నాశనం చేయడానికి మనసు వప్పక.... ఇన్నాళ్లు పడిన ఇబ్బందులు మరో రెండేళ్లు పడితే సరిపోతుంది.... కూతురి పెళ్లి కాస్త వాయిదా వేయచ్చని సమాధానపడి సరళ వాదిస్తున్నా వినకుండా ప్రావిడెంట్ ఫండులో మిగిలిన డబ్బు, సరళ మెడలో గొలుసు అమ్మి కొడుక్కి అమెరికా టిక్కట్టు కొనిచ్చి పంపాడు.

* * * * *

కొడుకు ఎమ్మెస్ చేసిన రెండు సంవత్సరాలు ప్రతి రోజూ లెక్క పెట్టుకుంటూ గడిపాడు ప్రభాకర్ - కొడుకుఎమ్మెస్ అయి ఉద్యోగంలో చేరానని రాసిన రోజున ప్రభాకర్ అనందానికి అవధులు కావు - ఇంక డాలర్లు రూపాయల్లోకి మార్చుకోడమే తరువాయి అనుకున్న తరుణంలో కొడుకు మెడలో దండలతో ఫోటోలు పంపించాడు. తన స్నేహితుడి చెల్లెలు గుజరాతి అమ్మాయిని పెళ్లాడానని..... ఆ అమ్మాయి స్కూలులో టీచరని..... ముందుగా చెప్పినా మీరెవరూ రాలేని పరిస్థితి గనక రిజిష్టరు

పెళ్లి చేసుకున్నానని ఫోటోలు పంపాడు. "నాకు తెలుసు ఇలా జరుగుతుందని - వాడుత్త సెల్ఫిష్ ఫెలో చిన్నప్పటినించి. మన ఇబ్బందులు, మన అప్పులు అన్నీ తెలిసి కొంప మునిగినట్లు ఇప్పుడే పెళ్లి చేసుకోవాలన్న తొందరేం వచ్చింది - చూస్తూండండి.... వాడు మనకి పైసా పంపడు.... మన తిప్పలు మనం పడాల్సిందే... ఏదో కొడుకు పుట్టి ఉద్ధరిస్తాడని ఆశ పెట్టుకున్న మనది తప్పు..... వాడిది కాదు..... ఈ కాలం పిల్లలు తెలివైన వాళ్లండి.... వాళ్లవసరాలు వాళ్లు తీర్చుకుంటారు, తెలివిగా.... ఏ నాటికీ కాస్త ఆడపిల్లే నయం... తల్లితండ్రి అన్న అభిమానం అన్నా వుంటుంది..... మగపిల్లలు మీసాలొచ్చేవరకే మన పిల్లలు..... హు.... ఇంకా వెర్రి మొర్రి కలలు కనడం మాని భూమ్మీదకి రండి.....' భర్త స్థితికి జాలి కల్గినా మెత్తగా చివాట్లు పెట్టకుండా వుండలేక పోయింది సరళ..... ప్రభాకర్ సరళని ఏమనగలిగే స్థితిలో లేక తలదించుకున్నాడు. దీనంగా వున్న అతని మొహం చూసి సరళే కొడుకుకి గట్టిగా ఉత్తరం రాసింది - చదువుకి అమెరికా వెళ్లడానికి అయిన డబ్బు వెంటనే పంపాలని, అప్పులు తీర్చవల్సిన బాధ్యత కొడుకుదే అని నిర్మొహమాటంగా రాసింది.

ఓ రెండు నెలల తరువాత కొడుకు సావకాశంగా రాసాడో ఉత్తరం చిన్న ఫ్లాట్ కొన్నాం, ఈ దేశంలో కారు లేకపోతే గడవదు, కారు కొన్నాం.... కొత్త సంసారానికి కావల్సిన సామాను కొనుక్కున్నాం... ఈ అప్పులన్నీ నా జీతంలో తీర్చాలి - నా భార్య జీతం ఇల్లు గడవడానికే సరిపోతుంది. మీరు ఓ మూడు నాలుగేళ్లు ఆగాల్సి వుంటుంది నా అప్పులు తీర్చాలంటే... అంటూ రాసి పడేశాడు.

ఇంక ఆగే ఓపిక నాకు లేదు, ఇంకా ఎదురుచూసే ఓర్మి సహనం లేదన్నట్టు ప్రభాకర్రావు గుండె ఓ నాడు నిద్రలో ఆగిపోయింది.

అందరికీ కబుర్లు వెళ్లాయి. కొడుక్కి ఫోను చేశారు. కొడుకు దుఃఖం వ్యక్తం చేసి - "ఇప్పుడింత హఠాత్తుగా నేను డబ్బు అది సమకూర్చుకుని టిక్కట్టు అది కొని వచ్చేసరికి వారం రోజులు పట్టచ్చు - అంచేత నా కోసం ఎదురుచూడకుండా అంతా కానిచ్చేయండి తరువాత వస్తాను" అనే సలహా ఇచ్చాడు.

అంత దుఃఖంలోను సరళకి, నవ్వు, జాలి కల్గాయి ప్రభాకర్ శవం చూస్తే! కనీసం తల కొరివి పెట్టడానికన్నా కొడుకుండాలి అని ఆశపడి కొడుకుని కన్న భర్త ఆ కనీస ఆశ కూడా నెరవేరనందుకు జాలి పడింది. మిగతా బంధువులు వచ్చారు. పెద్దల్లుడు మామగారికి తల కొరివి పెట్టాడు - కనీసం కర్మ చేసే వేళకన్నా కొడుకు వస్తాడని ఎదురుచూసిన సరళకి నిరాశే మిగిలింది. పదిహేనో రోజుకి కొడుకు దగ్గిరనించి ఉత్తరం మాత్రం వచ్చింది. "కొత్తగా ఉద్యోగంలో చేరడం, ఇల్లు, కారు అది అన్నీ కొనడం వల్ల చేతిలో డబ్బు లేక, జతపడక రాలేకపోయాను. అంతా అయిపోయాక నేను వచ్చి చేయగల్గింది మాత్రం ఏంవుంది. ఇంక నీవు ఆ పల్లెలో పెంకుటిల్లు అమ్మేసి ఆ డబ్బుతో చిన్నక్క పెళ్లి చేసేసి ఇక్కడికి వచ్చేయి. ఎలాగో రిటైరయి పోయావు ఒక్కర్తివి వుండద్దు మా దగ్గిరకి వచ్చేయి, నీకేం ప్రాబ్లమ్ వుండదు ఇక్కడ.... ఇల్లు అమ్మి పెళ్లికి అంతా ఖర్చు పెట్టేయకుండా నీ టిక్కట్టుకి సరిపడ దాచవలసింది" అని అఖర్న చేర్చాడు. ఓదార్పుగా, ఉదారంగా కొడుకు రాసిన ఉత్తరం చూసి అదోలా నవ్వింది సరళ - తల్లి నవ్వు చూసి కూతురు ఆ ఉత్తరం తల్లి చేతిల్లోంచి లాక్కుని చదివింది.

"భేష్ - జీతం బత్తెం లేని పని మనిషి వాడికి దొరికి వాడి ప్రోబ్లమ్ సాల్వ్ అయిపోతుంది - వెళ్లమ్మా అమెరికా వెళ్లు. పాపం కొడుక్కి ఇన్నాళ్లకి దయ గల్గింది.... హు.... పాపం వాడికి ఇంకా ఓ చిన్నక్క పెళ్లికి వుంద న్నది గుర్తున్నందుకు సంతోషించాను. పిత్రార్జితంలో వాటా అడక్కుండా చాలా ఉదారంగా ఇల్లు అమ్మి పెళ్లి చెయ్యమన్నాడు!..... ఆ కూలిపోయే పెంకుటిల్లు అమ్మి పెళ్లి చేసి దాన్లోనే టిక్కట్టు డబ్బు మిగుల్చుకోమని రాసిన నీ కొడుకు తెలివి తేటలకి ఎన్ని డాక్టరేట్‌లు ఇస్తే సరిపోతుంది.... వెళ్లమ్మా వెళ్లు.... నిన్ను ఉద్ధరిస్తాడు.' వ్యంగ్యంగా, హేళనగా మనసులో కసి అంతా వెళ్లగక్కింది ముప్పై ఏళ్ళ కూతురు..... కూతురికి పెళ్లి చెయ్యకుండా, ఉద్యోగం చేయిస్తూ, కొడుక్కోసం పెళ్లి వాయిదా వేస్తూ ఆ డబ్బు ఖర్చు పెట్టిన తల్లిదండ్రుల్ని మనసులో క్షమించలేక పోయినా ఇన్నాళ్లగా బయట పెట్టలేకపోయిన కసి అంతా వెళ్లగక్కింది.

'హు..... మీ లాంటి చదువుకున్న వాళ్లే కొడుకు అనుకుంటూ మగ పిల్లవాడి కోసం కొట్టుకుపోతూ, అడపిల్లలు పుడితే ఏడుస్తూ, వాళ్లని నిర్లక్ష్యం చేసి కొడుకులని నెత్తికెక్కించుకునే మీ లాంటి తల్లి తండ్రులకి నాలాంటి ఆడపిల్లల ఉసురు శాపంగా మారుతుందమ్మా- చచ్చాక మిమ్మల్ని భవసాగరం దాటించి స్వర్గద్వారాలు తెరుస్తారో లేదో ఎవరికీ తెలియదు కాని, బతికుండగా మీకు నరకం చూపించిన కొడుకులే మీకు తగిన వాళ్లు!...... ఈ శాస్తి మీకు సరి అయిందే....' హేళనగా అని విసురుగా వెళ్లిపోయింది కూతురు.

కూతురన్న ఏ మాటకీ తప్పు పట్టలేని ఆ తల్లి తన దగ్గిర ఆ మాటలకి జవాబు లేదన్నట్టు తలదించుకుంది.



## నాట్యరంగంలో సులోచనా సారలయ

ప్రధాని నెహ్రు, రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, యుగోస్లేవియా అధ్యక్షుడు మార్షల్ టిటో మరెందరో ప్రముఖుల ముందు నాట్య ప్రదర్శనలిచ్చి ఈనాడూ వయసుని జయించిన నృత్య ప్రవీణురాలుగా ప్రశంసలందుకుంటున్నారు సులోచనా సారలయ. తన సోదరి సుధారావ్‌తో కలిసి పలు ప్రదర్శనలిచ్చారు.

'టైమ్స్ అఫ్ ఇండియా' పత్రికకు నాట్య విభాగ విమర్శకురాలిగా, 'స్మృతి' పత్రికకి విలేఖరిగా వ్యవహరిస్తూ నృత్య పోటీలకు న్యాయ నిర్ణేతగా వుంటూ సులోచనా సారలయ నాట్యరంగానికి ఎంతో సేవ చేస్తున్నారు.

-కె. వాణీ ప్రభాకరి